సాక్షి నిజామాబాద్

సోమవారం, 7, అక్టోబర్, 2024



అత్తతో కలిసి మామ హత్య

ఆస్తి కోసం ఓ అల్లుడు అత్తతో కలిసి మామను హత్య చేశాడు. ఈ ఘటన బోధన్ పట్టణంలో చోటు చేసుకుంది.

- 8లో ▸



ఆశాజనకంగా సోయా

వానాకాలం సీజన్ సోయా రైతులకు కలిసివచ్చింది. దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.8 /22.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రాజిరెడ్డి



ఖలీల్‌వాడి: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంతిరెడ్డి రాజిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని కోటగల్లీకి చెందిన రాజిరెడ్డి మొదట డీఎస్, తర్వాత సుదర్శన్ రెడ్డి అనుచరుడిగా ఉన్నారు. ఆయన గతంలో పీఏసీఎస్ చైర్మన్‌గా పని చేశారు. కాగా నుడా చైర్మన్ వస్తుందని ఆయన ఆశించగా ప్రభుత్వం గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించింది.

కామారెడ్డి చైర్మన్‌గా..



భిక్కనూరు: కామారెడ్డి జిల్లా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన మద్ది చంద్రకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేశం ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. చంద్రకాంత్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయన రామేశ్వర్‌పల్లి ఎంపీటీసీగా, ఆయన భార్య శ్యామం రామేశ్వర్‌పల్లి సర్పంచ్‌గా పనిచేశారు.

నేటి నుంచి చెరువుల్లో చేపపిల్లల విడుదల

నిజామాబాద్‌అర్బన్: మత్స్యకార కుటుంబాలకు చేయూత అందించేందుకు వంద శాతం సబ్సిడీపై జిల్లాలోని ఆయా చెరువుల్లో నేటి నుంచి చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 396 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లోని సుమారు 24 వేల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరేలా 2.27 కోట్ల చేప పిల్లలు చెరువుల్లో వదలడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వీటిలో 35 నుంచి 40 ఎం.ఎం సైజు గల చేప పిల్లలు 135 లక్షలు, 80 నుంచి 100 ఎంఎం సైజు గల 91 లక్షల చేప పిల్లలను మత్స్య అభివృద్ధి పథకం కింద విడుదల చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. చేప పిల్లలు వదిలే సమయంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులు వాటి నాణ్యతను తనిఖీ చేయాలని సూచించారు. సైజులో కానీ వాటి రకాల్లో తేడాలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

జిల్లాలో 60వేలకు పైగా సభ్యత్వాలు



డిచ్‌పల్లి: జిల్లాలో ఇప్పటి వరకు 60 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేయించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌పటేల్ కులాచారి అన్నారు. మహా సంపర్క్ యోజనలో భాగంగా ఆదివారం డిచ్‌పల్లిలో ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు 72 గంటల మహా సంపర్క్ యోజనలో భాగంగా పార్టీ అధ్యక్షుడి నుంచి బూత్ లెవల్ అధ్యక్షుడి వరకు ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. గతేడాది కంటే ఈ సారి సభ్యత్వ నమోదు ఎక్కువగా చేశామన్నారు. ప్రతి బూత్ పరిధిలో 100 సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గద్దె భూమన్న, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, నాయకులు పద్మారెడ్డి, సురేష్, శివారెడ్డి, సతీష్ రావు, మోహన్‌రెడ్డి, నాయుడు రాజన్న, శేఖర్, లక్ష్మణ్, విఠల్, శ్రీనివాస్ గౌడ్, మురళీ గౌడ్, అబ్బులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం 22 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. వరద తగ్గడంతో అధికారులు గేట్లను మూసివేశారు. కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 150 క్యూసెక్కులు వదులుతున్నారు.

నిజాంసాగర్‌లోకి 18,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 18,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నాలుగు గేట్ల ద్వారా 17 వేల క్యూసెక్కులు నదిలోకి వదులుతున్నారు. ప్రధాన కాలువకు 1,700 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు.



పాంగ్రా వాగు పరిధిలో నిర్మించిన క్లబ్ హౌస్

నిజామాబాద్ నగరంలోని అమ్మ వెంచర్ సమీపంలో అశోక ఎలైట్ పేరుతో నిర్మించిన అపార్ట్‌మెంట్లకు సంబంధించి ఓ క్లబ్ హౌస్ కట్టారు. ఈ క్లబ్ హౌజ్ పూర్తిగా పాంగ్రా వాగును ఆక్రమించి నిర్మించారు. ఈ అక్రమ కట్టడానికి మున్సిపల్ అధికారులు సైతం ముడుపులు తీసుకుని సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా జిల్లావ్యాప్తంగా చాలా చోట్ల వాగులు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో జిల్లాలో నిడ్రా ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

హైడ్రా మాదిరిగా నిడ్రా!

- జిల్లాలో ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం ప్లాన్
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రకటనతో చర్చ
- ప్రణాళిక తయారుచేస్తున్న కలెక్టర్
- అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు బిల్డర్ల యత్నం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: హైదరాబాద్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్న 'హైడ్రా'ను ఆపేదే లేదని.. దీనిపై ఎవరెన్ని అవాంతరాలు సృష్టించినా ముందుకు వెళ్తామని ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. హైడ్రాను ఆపితే భవిష్యత్తులో హైదరాబాద్ మరో వయనాడ్ అవుతుందన్నారు. జిల్లాలోనూ హైడ్రా మాదిరిగా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆ క్రమించిన వారిలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, వా రి కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నా సదరు ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. దీంతో ఈ విషయమై జిల్లావ్యాప్తంగా చర్చ జరుగుతోంది. జిల్లాలో కబ్జాలు, ఆక్రమణల విషయమై అన్ని వర్గా ల్లో చర్చ జరుగుతుండగా, ఆక్రమణదారుల్లో మా త్రం టెన్షన్ నెలకొంది. దీంతో చెరువులు, వాగుల్లో నిర్మాణాలు చేపట్టి విక్రయించిన బిల్డర్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిలను ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. చివరకు వాళ్లు వేసిన అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొన్నా మధ్యతరగతి అమాయకులు మాత్రం పరేషాన్ అవుతున్నారు. ఆక్రమణల తొలగింపునకు సంబంధించి కలెక్టర్ ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

చెరువుల్లో కబ్జాలు

జిల్లాలోని పలు చెరువులు కబ్జా అయ్యాయి. నవీపేట దర్యాపూర్ చెరువు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా ఇందులో 5 ఎకరాల వరకు రియల్ స్టేట్ వ్యాపారులు ఆక్రమించారు. నవీపేట మండలం మోకన్‌పల్లి చెరువులో 60 ఎకరాల శిఖం భూమిని కొందరు పట్టాలు చేసుకున్నారని గ్రామస్తులు గతంలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. భీమ్‌గల్ రాధం చెరువు భూములు ఎన్నో ఏళ్లుగా కబ్జాదారుల చేతుల్లో ఉన్నాయి. రాజకీయ నాయకుల అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా చేసి అమ్మేశారు. ఇందల్వాయి చెరువు 80 ఎకరాలు కబ్జా అయింది. కొందరు ఈ ఆక్రమిత స్థలాల్లో డెయిరీ ఫామ్‌లు కట్టారు. నందిపేటలోని రఘునాథ చెరువు కబ్జా చేసి నిర్మాణాలు చేశారు.

నగరంలో అనేక ఆక్రమణలు

నిజామాబాద్‌లో కీలకమైన పూలాంగ్ వాగు అడుగడుగునా కబ్జా అయింది. మాలపల్లి నుంచి ప్రారంభమయ్యే డి-54 కెనాల్ చంద్రశేఖర్‌కాలనీ వరకు కబ్జా అయింది. అర్సపల్లిలోని రామర్తి చెరువు 90 శాతం కబ్జా అయింది. భారీ నిర్మాణాలు చేశారు. ధర్మపురి హిల్స్, డ్రైవర్స్ కాలనీ, పెయింటర్స్ కాలనీల్లో 40 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా అయింది.

సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు

నగరంలో చాలా చోట్ల సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చినా అక్రమార్కులకు పాల్పడుతున్న అధికారులను కాపాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో కిందిస్థాయి అధికారులు మాఫియా మాదిరిగా వ్యవహారాలు నడిపి రూ.కోట్లలో దండుకుంటున్నారు.

వీటికి మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు కేటాయించారు.

కనుమరుగవుతున్న కాలువలు

ఆర్మూర్ పట్టణంలో నిజాంసాగర్ 82/2/1 మైనర్ కాలువ ఆక్రమణలతో కనుమరుగు అవుతోంది. 70 ఫీట్ల వెడల్పుతో పట్టణంలోని మామిడిపల్లి, పెర్కిట్-కొటార్మూర్ మీదుగా వెళ్లే ఈ కాలువ ఉనికిని కోల్పోయింది. మాక్లూర్ మండలం దాస్‌నగర్ వద్ద నిజాంసాగర్ ప్రధాన కాలువ 68వ డిస్ట్రిబ్యూటరీని కబ్జా అయింది. ఈ కాలువను ఆక్రమించి కొందరు వెంచర్లు వేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు ఇష్టం వచ్చినట్లు కబ్జాలు చేసి ఏకంగా ప్రహరీలతో బిల్డింగ్‌లు నిర్మించారు. ఫలితంగా చిన్న వర్షం కురిస్తే జాతీయ రహదారి జలమయం అవుతోంది.

వసతులు లేకున్నా అటానమస్

- నిబంధనలు పాటించని యూనివర్సిటీ అధికారులు
- కనీసం పరిశీలించకుండానే అనుమతులు ఇస్తున్న వైనం



నిజామాబాద్ అర్బన్: కనీస వసతులు లేని ఓ ప్రైవేట్ కళాశాలకు తెలంగాణ యూనివర్సిటీ అధికారులు అటానమస్ హోదా కల్పించారు. వాణిజ్య భవనంలో కొనసాగుతున్నా కనీసం పరిశీలన చేపట్టకుండానే అనుమతులను జారీ చేశారు. యూజీసీ నిబంధనలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రైవేటు కళాశాల యాజమాన్యం వారికి ఈ హోదాను కల్పించారు. నిబంధనల ప్రకారం ప్రైవేట్ కళాశాలకు అటానమస్ హోదా కల్పించాలంటే విశాలమైన ఆటస్థలం, లైబ్రరీ, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ఉండాలి. ప్రతి సబ్జెక్టుకు నిపుణుడైన బోధకుడు ఉండాలి. ముఖ్యంగా వాణిజ్య సముదాయంలో ఉండకూడదు. ప్రస్తుతం నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలకు అటానమస్ హోదా కల్పించిన తెలంగాణ యూనివర్సిటీ అధికారులు ఈ అర్హతలు ఏమీ లేకున్నా శాశ్వతం హోదా కల్పించేలా కృషి చేశారు. సంబంధిత కళాశాల అటానమస్ హోదాను చూపిస్తూ కళాశాలలో మూడింతల ఫీజును వసూలు చేస్తుంది.

గిరిరాజ్ కళాశాలకు మొండిచేయి

అన్ని అర్హతలు ఉన్న గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ గుర్తింపు కోసం ఎంతో ప్రయత్నిస్తోంది. విశాలమైన ఆటస్థలం, భవనాలు, లైబ్రరీ అందుబాటులో ఉన్నాయి. న్యాక్ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు వచ్చి పరిశీలన చేసి గుర్తింపును రెండేళ్లకు ఒకసారి రెన్యువల్ చేస్తూ వస్తున్నారు. అలాగే అటానమస్ కోసం దరఖాస్తు చేసుకున్నా హోదా ఇవ్వడం లేదు. ప్రైవేట్ కాలేజీకి అర్హత లేకున్నా అటానమస్ హోదా ఇచ్చి ప్రభుత్వ కాలేజీకి మొండి చేయి చూపడంపై విమర్శలు వస్తున్నాయి. అయితే సదరు కాలేజీకి హోదా ఇవ్వడం కోసం భారీగా మామూళ్లు అందుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

నాడు సౌకర్యాలు లేవని చెప్పి..

అటానమస్ హోదా పొందిన సదరు కాలేజీకి శాశ్వత అనుబంధ గుర్తింపుపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత సంవత్సరం ఆ కాలేజీలో యూనివర్సిటీ ఆడిట్ సెల్ అధికారులు తనిఖీలు చేశారు. కళాశాలలో అనేక లోపాలు ఉన్నాయని గుర్తించారు. వసతులు, తరగతి గదులు సరిపడా లేవని అధికారులు విలేకరులకు కూడా చెప్పారు. ప్రస్తుతం అదే కళాశాలకు శాశ్వత అనుబంధ గుర్తింపు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడి అటానమస్ హోదా ఇచ్చిన యూనివర్సిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ముగిసిన బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ

- బాలికల విభాగంలో విజేతగా ఖమ్మం
- బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు



ఖమ్మం బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రాబెల్స్ హైస్కూల్ మైదానంలో రెండురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యా డ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో రంగారెడ్డి జిల్లా, ద్వితీయ స్థానంలో ఆదిలాబాద్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో హైదరాబాద్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు నిలిచాయి. విజేతలకు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పీవీ రమణ, జిల్లా అధ్యక్షుడు ఎల్.నర్సింగరావు, కోశాధికారి చిన్నయ్య, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణమూర్తి, రైల్వే కోచ్ శశి కపలు అందించారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మకరందు, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

నిజామాబాద్ రూరల్: క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తించి మందులు వాడితే నయం అవుతుందని మున్సిపల్ కమిషనర్ మకరందు అన్నారు. ఆదివారం ఇందూర్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఈ ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ బోర్గాం నుంచి పాత కలెక్టరేట్ వరకు కొనసాగింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. క్యాన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఐదేళ్లకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రి వైద్యుడు ప్రద్యుమ్నరెడ్డి, మెడికల్ డైరెక్టర్ రవీంద్రనాథ్, మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



గాయత్రినగర్‌లో కొలువుదీరిన అమ్మవారు

ఆదిశక్తి నమోస్తుతే..

జిల్లాలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానం చేశారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను ఢీకొట్టేది మజ్లిసే

- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

ఖలీల్‌వాడి: బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను ఢీకొట్టేది మజ్లిస్ పార్టీయేనని ఆ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం నగరంలోని ఖిల్లా రోడ్డులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 2024 పార్లమెంట్ ఎన్నికలతో మోదీ పరేషాన్ అయ్యారని చెప్పారు. దేశవ్యాప్తంగా ముస్లింలను ఏకం చేయడంతో బీజేపీ సీట్లు తగ్గాయన్నారు. బీజేపీని ఓడించడంతో ముస్లింలపై కక్షపూరితంగా బుల్డోజర్లను పంపి వారి ఆస్తులను కూలగొడుతున్నారని ఆరోపించారు. గల్లీ నుంచి బలపడితేనే ముస్లింలపై దాడులను ఎదుర్కొనే అవకాశం ఉంటుందన్నారు. యువకులు చట్టసభలకు రావాలన్నారు. యువకులు ఏకమై ఎంఐఎం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ముస్లింలు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్నాని చెప్పారు. సెక్రెటేరియట్ హుస్సేన్‌సాగర్ భూముల్లో ఉందని ఇప్పుడు దానిని కూలుస్తారా అని ప్రశ్నించారు. నిజామాబాద్‌లో మజ్లిస్‌ను బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. కామారెడ్డిలో అరెస్టయిన ముస్లిం యువకులను విడిచిపెట్టాలన్నారు. ఎంఐఎం నాయకులు మహమ్మద్‌బీన్ అబ్దులా బలాల, జాబీర్ హైమద్, మహమ్మద్ షకీల్, మీర్‌మాజీజ్ అలీ, ఫయాజీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): వానాకాలం వరి ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా సహకార శాఖ ఆధ్వర్యంలో గతేడాది ఖరీఫ్‌లో 386 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 3.86లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఈ ఏడాది 416 కేంద్రాలు ఏర్పాటు చేసి 5లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి గ్రామాల్లో సిద్ధం చేస్తున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుల నుంచి డిమాండ్ ఉంది. అధికారులకు కూడా వినతిపత్రాలు అందజేశారు. ప్రధానంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని తాండా ప్రాంతాల్లో కేంద్రాలు కావాలంటున్నారు. కొత్తగా 20 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు డీసీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. అయితే కొనుగోలు కేంద్రాలను దసరాకు ఒకరోజు ముందు లేదా దసరా తర్వాత ప్రారంభించే అవకాశాలున్నాయని వెల్లడించారు. మార్గదర్శకాలే ఆలస్యమన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో 65 కేంద్రాలు

మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేయడానికి గ్రామీణాభివృద్ధి శాఖ సిద్ధమైంది. గతేడాది జిల్లాలో 66 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 5.38లక్షల క్వింటాళ్ల వడ్లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం 65 కేంద్రాల ద్వారా 5.50లక్షల క్వింటాళ్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్ష్యానికి మించి ధాన్యాన్ని సేకరిస్తామని డీఆర్‌డీవో సాయాగౌడ్ తెలిపారు.

క్లుప్తంగా

'కుల బహిష్కరణ చేస్తామని బెదిరిస్తున్నారు'



వర్ని: మోస్రా మండల కేంద్రంలో గౌడ కులానికి చెందిన కొందరు పెద్దలు తమని కులబహిష్కరణ చేస్తామని బెదిరిస్తున్నారని ఆదివారం బోధన్ ఎక్సైజ్ శాఖాధికారులకు 12 కుటుంబాలకు చెందిన యువకులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో గౌడ కులస్తులు కొందరు వారి ఇష్టానుసారంగా కల్లు మామ్లా నడుపుతున్నారని వారి అక్రమాలు ఆగడాలను ప్రశ్నించినందుకు అన్ని కార్యక్రమాలకు దూరంగా పెడుతున్నారని పేర్కొన్నారు. సదరు గౌడ సంఘం సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.20 వేల ఖర్చుతో డ్రోన్



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం గున్కుల్ గ్రామానికి చెందిన ముశ్నబోయిన భానుప్రకాశ్ గౌడ్ రూ.20 వేలతో డ్రోన్ తయారు చేసి ఆశ్చర్యపరిచాడు. ఆ డ్రోన్ ఆదివారం గాలిలోకి ఎగరడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. భానుప్రకాశ్ మెకానికల్ డిప్లమా పూర్తి చేసి ప్రస్తుతం అప్లికేషన్ సెక్యూరిటీ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అయితే డిప్లమా చదువుతున్న 2018లోనే కళాశాలలో మందుల పిచికారీకి డ్రోన్ తయారు చేశాడు. నేర్చుకున్న విద్యను మర్చిపోవద్దని భావించిన భానుప్రకాశ్‌గౌడ్ దసరా సెలవుల్లో గున్కుల్ గ్రామానికి వచ్చాడు. ఆన్‌లైన్‌లో రూ.20 వేలకు డ్రోన్ పరికరాలను కొనుగోలు చేశాడు. డ్రోన్‌ను తయారు చేసి ఆకాశంలోకి పంపడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆశాజనకంగా సోయా దిగుబడులు



కల్దుర్కిలో సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి(ఫైల్)



సాలూరలో సోయా ఆరబెడుతున్న రైతులు

- ప్రభుత్వ మద్దతు ధర రూ.4,892
- బయటి మార్కెట్లో పడిపోయిన ధర
- సేకరణ పరిమితిపై రైతుల్లో ఆందోళన

బోధన్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్, వాతావరణ పరిస్థితులు సోయా రైతులకు కలిసివచ్చింది. ఆశాజనకంగా దిగుబడులు చేతికొస్తుండటంతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. నాలుగేళ్లగా ప్రకృతి ప్రకోపం కారణంగా పంట దెబ్బతిని దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపడంతో రైతులు నష్టాల బారిన పడ్డారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో సోయా పంట కోతలు వారం రోజు క్రితం నుంచి ప్రారంభం కాగా, దిగుబడులు రైతుల ముంగిట్లోకి చేరుతున్నాయి. ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. గత ఏడాది ఎకరానికి గరిష్ఠంగా 6 నుంచి 7 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు చేతికి రాక నష్టాలకు గురయ్యారు.

జిల్లాలో 37 వేల ఎకరాల్లో సాగు

నిజామాబాద్ జిల్లాలో 37 వేల ఎకరాల విస్తీర్ణంలో సోయా పంట సాగైనట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మంజీర, గోదావరి నదుల తీరంలో సారవంతమైన నల్లరేగడి భూములున్నా బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బోధన్, సాలూర, రెంజల్, కోటగిరి, పోతంగల్ మండలాల్లో జిల్లాల్లోనే అత్యధిక విస్తీర్ణంలో సోయా పంటను రైతులు సాగు చేశారు. బోధన్ మండలంలో 7,372 ఎకరాల్లో, సాలూరలో 5,355, రెంజల్‌లో 5,333 ఎకరాల్లో సోయా సాగైంది. పంట కోత కొన్ని చోట్ల 50 శాతం వరకు పూర్తయ్యాయి. ప్రభుత్వం సోయా క్వింటాలుకు రూ.4,892 ధర ప్రకటించింది. మార్కెట్లో వారం రోజుల క్రితం క్వింటాలుకు రూ.4600 ఉండగా, ప్రస్తుతం రూ.4400లకు పడిపోయింది.

ఎమ్మెల్యే చొరవతో కొనుగోలు కేంద్రాలు

సోయా దిగుబడులు రైతులకు చేతికి రావడం, మార్కెట్లో వ్యాపారులు ధరను తగ్గించడం, వాతావరణ పరిస్థితిని గుర్తించిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి స్వయంగా సాలూర మండలంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 3న మార్క్‌ఫెడ్, నాఫెడ్ సహకారంతో కల్దుర్కిలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, సాలూర, హున్సా సొసైటీల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మొదట వేల్పూర్ సొసైటీలో కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది.

కొనుగోలు ప్రక్రియ ప్రారంభం ఎప్పుడో?

కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న నాఫెడ్ అనుమతి మేరకు రాష్ట్ర మార్క్‌ఫెడ్ సంస్థ ప్రతి ఏటా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతుల నుంచి మద్దతు ధరకు సోయాను కొనుగోలు చేస్తోంది. జిల్లాలో నాలుగు రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికి రైతుల నుంచి పంట సేకరణ ప్రక్రియ జరగటం లేదు. రైతులు ఖాళీ ప్రదేశాలు, సొసైటీ కొనుగోలు కేంద్రాల్లో సోయాను ఆరబెడుతున్నారు. రైతులను వర్షం భయం వెంటాడుతోంది.

పరిమితి ఆంక్షల గుబులు

కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ఎకరానికి 6 క్వింటాళ్ల చొప్పున సేకరించాలని మార్క్‌ఫెడ్ పరిమితి విధించింది. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చిన పరిస్థితిలో రైతులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. పరిమితి ఆంక్షలు రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఎన్ని క్వింటాళ్లు కొంటారో మార్క్‌ఫెడ్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అలాగే సొసైటీలకు సోయా సేకరణకు సంబంధించిన అలాట్‌మెంట్ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాల్సిన అవసరం ఉంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన సహకార సంఘాల పాలకవర్గ సభ్యులపై రైతుల నుంచి కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని ఒత్తిడి పెరుగుతోంది.

10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది



ఆరు ఎకరాల్లో సోయా సాగు చేశాను. పంట కోత పూర్తయింది. ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్లో ధర లేదు. సొసైటీ కొనుగోలు కేంద్రంలో పంటను పూర్తిగా కొనుగోలు చేయాలి. గతంలో ఎకరానికి 6 క్వింటాళ్ల మేరకు కొనుగోలు చేశారు.ఈ సారి దిగుబడి పెరిగినందున పంటను పూర్తిగా కొనాలి. లేకపోతే మళ్లీ దళారులకు అమ్ముకొని నష్టపోవాల్సి వస్తుంది. – ముట్టిన్ దత్తు, సోయా రైతు, సాలూర

డీజేలకు అనుమతివ్వండి



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న మానాల, డీజే అసోసియేషన్ సభ్యులు

ఖలీల్‌వాడి: దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా డీజేల అనుమతి, హోటళ్ల సమయం విషయంలో సీపీ కల్మేశ్వర్ సానుకూలంగా స్పందించినట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం సీపీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డితోపాటు జిల్లా డీజే అసోసియేషన్ సభ్యులు, హోటల్ యజమానులు సీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ.. తక్కువ సౌండ్‌తో పండుగలకు డీజేకు అనుమతి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కార్పొరేటర్ ఖుద్దూస్, నిజామాబాద్ జిల్లా డీజే అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి:సీపీ

ఖలీల్ వాడి: డీజే నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 వరకు లైసెన్సులు, పర్మిషన్లు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చే డీజేలను పూర్తిగా నిషేధించినట్లు వివరించారు. పోలీస్ శాఖ ఇచ్చిన ఆదేశాలు పాటిస్తూ ప్రజలకు, సీనియర్ సిటిజన్లకు, పిల్లలకు ఇబ్బందులు కలుగకుండా చట్ట పరిధిలో రెండు సౌండ్ బాక్స్ సిస్టమ్‌లు వాడుతూ ఈ కార్యక్రమాలను జరుపుకోవాలని తెలియజేశారు.

రాష్ట్ర జట్టుకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలలో ఈ నెల 6 నుండి 10 వరకు జరుగుతున్న జాతీయ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికై తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్నట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర బాల బాలికల జట్లను ప్రథమ స్థానంలో నిలపుడానికి క్రీడాకారులు కృషి చేయాలన్నారు. ఎంపిక పట్ల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్, జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, జిల్లా సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు నీరజారెడ్డి, జైడి రాజ్ కుమార్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్.సౌమ్య రాణి (వంది మడుగు), జి.సాత్విక(పిప్పిరి), డి.సన్నిత(పుప్పాలపల్లి), జి.శ్రావిక (పిప్పిరి), కె.సోనీ (మంచిప్ప), జె. వైశాలి(అక్లూర్), సీహెచ్.అరవింద్ (బడా భీంగల్), ఎస్. లక్ష్వేందర్(రాష్ట్ర జట్టు కెప్టెన్, చౌట్‌పల్లి), పి.కళ్యాణ్ రాజ్ (ఆర్మూర్), వి.అభినేష్ (ఆర్మూర్)లు ఎంపికయ్యారు.



ఆర్వోబీ వద్ద గుంతల్లో దిగబడిన పెట్రోల్ ట్యాంకర్

ఎన్నాళ్లీ నరకం

- నత్తనడకన మాధవ్‌నగర్ ఆర్వోబీ పనులు
- వాహన చోదకులకు తప్పని తిప్పలు

నిజామాబాద్ రూరల్: రెండేళ్లుగా మాధవనగర్‌లో నిర్మిస్తున్న ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) పనులు నత్తనడకన సాగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు సాగుతున్న బ్రిడ్జి వద్ద రోడ్లు గుంతలు పడటంతో నిత్యం ఈ మార్గంలో వెళ్లేవారు నరకం చూస్తున్నారు. ఆదివారం ఓ పెట్రోల్ ట్యాంకర్ ఈ మార్గంలో వెళ్తూ దిగబడింది. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం , కాంట్రాక్టర్ స్పందించి త్వరగా పనులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

అత్తతో కలిసి మామను చంపిన అల్లుడు



గొర్రెల కొట్టాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- ఆస్తిపై కన్నేసి ఘాతుకం
- సాధారణ మృతిగా చిత్రీకరించేందుకు ప్రయత్నం
- పోలీసుల రాకతో బయటపడిన నిజం



హత్యకు గురైన శంకర్

బోధన్‌టౌన్(బోధన్): మామ ఆస్తిపై కన్నేసిన అల్లుడు అత్తతో కలిసి మామను హత్య చేసిన ఘటన బోధన్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని ఉద్మీర్‌గల్లీకి చెందిన క్యామెల్ల శంకర్(45) శనివారం రాత్రి గొర్రెల కొట్టం బయట నిద్రిస్తుండగా అల్లుడు రవి, అత్త చిన్నమ్మతో కలిసి గొంతు నులిమి చంపి ఇంట్లోకి తీసుకొచ్చి సాధారణ మృతిగా చిత్రీకరించేందుకు యత్నించారు. స్థానికులు ఒంటిపై ఉన్న గాయాలను గమనించి అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని, గొర్రెల కొట్టాన్ని పరిశీలించారు. గొంతు నులిమిన ఆనవాళ్లు, ఇతర గాయాలను గమనించి అల్లుడు, అత్తను అదుపులోకి తీసుకొని విచారించగా.. తామే హత్యకు పాల్పడినట్లు వారు అంగీకరించారని సీఐ వెంకట నారాయణ తెలిపారు. చెక్కీ క్యాంప్‌నకు చెందిన రవికి ఐదేళ్ల క్రితం శంకర్ పెద్దకూతురుతో వివాహం జరిగింది. అనంతరం రవిని వారు ఇల్లరికం తెచ్చుకున్నారు. ఇటీవల ఇంట్లో అత్తమామకు జరుగుతున్న చిన్నచిన్న గొడవలను అదునుగా తీసుకొని ఈ హత్యకు పూనుకున్నాడు. మద్యం సేవించి కొట్టంలో మంచంపై పడుకున్న శంకర్‌ను ఛాతీపై పిడిగుద్దులు గుద్దడంతో పాటు గొంతు నుమిలి హత్య చేసినట్లు వారు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, చిన్న కూతురు సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకట నారాయణ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసులు నమోదు



భిక్కనూరు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఇద్దరు మహిళలపై దాడి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని కూరగాయల సంతలో ఆదివారం రాత్రి ఇద్దరు మహిళలపై ఇద్దరు యువకులు దాడి చేసి గాయపరిచారు. సంతలో దుకాణం ఏర్పాటు చేసుకొని మహిళలు కూరగాయలు విక్రయిస్తుండగా ఇద్దరు యువకులు ఆటోను తీసుకొచ్చి వారి దుకాణాల ఎదుట పెట్టడంతో మహిళలు ఆటోను పక్కకు తీయాలని చెప్పారు. వారి మాట వినకుండా ఆటోను అక్కడే ఉంచడంతో మహిళలు గట్టిగా అరిచి చెప్పారు. ఆగ్రహించిన యువకులు ఇద్దరు మహిళలపై దాడి చేశారు. ఒక మహిళకు తలపై, మరో మహిళకు ముక్కుపై తీవ్రగాయాలు అయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిన వారిని ఆస్పత్రికి, యువకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బాలుడి విక్రయం



- ఐదుగురిపై కేసు నమోదు

ఆర్మూర్‌టౌన్: ఏడు నెలల బాలుడిని విక్రయించిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదైంది. వివరాలు.. నందిపేట మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన అంగేటి లక్ష్మి, పోశెట్టి దంపతులు ఏడాది నుంచి ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో నివాసం ఉంటున్నారు. భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏడు నెలల బాబు ఉన్నాడు. తాగుడికి బానిసైన పోశెట్టి గత శుక్రవారం మద్యం మత్తులో తన శిశువును పెర్కిట్‌కు చెందిన మధ్యవర్తి మహమ్మద్ గౌస్ ద్వారా పట్టణంలోని శాస్త్రీనగర్‌కు చెందిన హబీబ్‌ఖాన్‌కు రూ.30 వేలకు విక్రయించాడు. హబీబ్‌ఖాన్ నిర్మల్‌లో ఉంటున్న సంతానం లేని తన కూతురు రషీద భర్త మహమ్మద్‌కు శిశువును ఇచ్చాడు. వారం రోజుల తరువాత తాగిన మైకంలో పోశెట్టి 100 డయల్‌కు ఫోన్‌చేసి తనబాబును తనకు ఇప్పించాలని ఫిర్యాదు చేశాడు. నందిపేట్, ఆర్మూర్ పోలీసులు పెర్కిట్‌కు చేరుకొని పోశెట్టిని విచారించగా విక్రయ ఉదంతం మొత్తం వెలుగులోకి వచ్చింది. పసికందు విక్రయ వ్యవహారంలో బాధ్యులైన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం శిశువును ఐసీడీఎస్ అధికారులకు పోలీసులు అప్పగించారు.

కొండచిలువ హతం



నందిపేట్ (ఆర్మూర్): షాపూర్‌లో చేపల వలకు చిక్కుకున్న కొండచిలువను జాలర్లు హతమార్చారు. గ్రామంలోని జంగం కుంట చెరువులో చేపలు పట్టేందుకు జాలర్లు శనివారం సాయంత్రం కండ్రిలను ఏర్పాటు చేశారు. ఆదివారం చేపల కోసం కండ్రిలను లాగగా వలలో సుమారు 30 కిలోల బరువు, 8 ఫీట్ల పొడవు గల కొండచిలువ చిక్కింది. దీంతో జాలర్లు చెరువు నుంచి బయటకు లాగి కొండ చిలువను చంపివేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్

సిరికొండ: మండలంలోని ఒంటిప్ప తండా వద్ద వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఎల్.రామ్ ఆదివారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నందున ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

గుండెపోటుతో సర్వేయర్ మృతి



సర్వేయర్ మోహన్(ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి మండల రెవెన్యూ సర్వేయర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కంకెటీ మోహన్(54) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఏడాది కాలంగా ఆయన ఇందల్వాయిలో పని చేస్తున్నారు. గుండెపోటు రావడంతో ఆయనను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా అక్కడే మృతి చెందారు. ఆయనకి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల తహసీల్ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలియజేశారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్..



కొలిప్యాక గంగారాం(ఫైల్)

వేల్పూర్: జాన్కంపేట్ మాజీ సర్పంచ్ కొలిప్యాక గంగారాం(79) అనారోగ్యంతో శనివారం రాత్రి మరణించగా ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన 1985 నుంచి 1987 వరకు పచ్చల నడ్కుడ సొసైటీ తొలి చైర్మన్‌గా, 1988 నుంచి 1993 వరకు జాన్కంపేట్ సర్పంచ్‌గా, 1995 నుంచి 1999 వరకు ఎంపీటీసీగా పని చేశారు. పలువురు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆయనకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

ధర్పల్లి: జీవితంపై విరక్తితో హోన్నాజీపేటకి చెందిన బండి నర్సవ్వ(40) అనే మహిళ అదే గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. వివరాలు.. నర్సవ్వకు కొన్ని రోజులుగా చెవులు కూడా వినిపించడంలేదు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి నర్సవ్వ బయటకు వెళ్లింది. రాత్రి వరకు బంధువులు గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం స్థానిక చెరువులో ఆమె మృతదేహం కనిపించింది. నర్సవ్వ ఇటీవల మానసికంగా కృంగిపోయిందని, మతిస్థిమితం కూడా కోల్పోయిందని బంధువులు చెబుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అప్పుల బాధతో మరొకరు ..



సాయిలు మృతదేహం

వర్ని: మోస్రా గ్రామానికి చెందిన సంఘం సాయిలు(46) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు వర్ని ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. వివరాలు..సాయిలు ఈనెల 5న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గ్రామ ఊర చెరువులో ఆదివారం ఉదయం స్థానికులు సాయిలు శవాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించారు. అప్పుల బాధతోనే చెరువులో దూకి సాయిలు ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు చెబుతున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. వివరాలు.. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ గ్రామానికి ఖాళీ పండ్ల బాక్సులు తీసుకుని వస్తున్న డీసీఎం వ్యాన్ భిక్కనూరు మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ షేక్ అబీద్(36), క్లీనర్ సంతోష్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా షేక్ అబీద్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అర్గుల్ శివారులో మరొకరు..

జక్రాన్‌పల్లి: అర్గుల్ శివారులోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు మహారాష్ట్రలోని భోకర్ తాలూకాలోని రేనాపూర్ మండల కేంద్రానికి చెందిన పండిత్ గోరి(28)గా గుర్తించారు. బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా దారి తప్పి అర్గుల్ వైపు రాగా శివారులోని కోల్డ్ స్టోరేజీ వద్ద డివైడర్ ఢీకొని కిందపడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ప్రమాదవశాత్తూ నీటమునిగి మత్స్యకారుడు..



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ నీటమునిగి మృతి చెందాడు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాలు.. డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన తోకల గంగాధర్ (50) సమీపంలోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఆదివారం ఉదయం చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు.

కాలువలో జారిపడి ఒకరి గల్లంతు

ఖలీల్‌వాడి: ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి ఒకరు గల్లంతైనట్లు నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై మొగులయ్య తెలిపారు. వివరాలు.. ఆదివారం నగరంలోని ధర్మపురి హిల్స్‌కు చెందిన అక్బర్ ఖాన్(38) సారంగాపూర్ డైరీ ఫారం వద్ద ఉన్న కాలువ గట్టుపై కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. సమాచారం తెలిసి స్థానిక కాలనీవాసులు, కార్పొరేటర్లు అక్కడికి చేరుకుని అక్బర్ కోసం గాలించారు. స్థానికుల సమాచారం మేరకు ఆరో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.లక్షా 50 వేల మోసం

నిజామాబాద్ రూరల్: మల్లారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.లక్షా 50 వేలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. శనివారం ఆన్‌లైన్ యాప్ ద్వారా పెట్టుబడి పెడితే దానికి రెట్టింపు నగదు ఇస్తామని ఆన్‌లైన్ యాప్ నిర్వాహకులు పేర్కొనడంతో ఆ వ్యక్తి లక్షా 50 వేల రూపాయలను పెట్టుబడి పెట్టాడు. దీంతో పెట్టిన నగదు కాస్త మాయమవడంతో లబోదిబోమంటూ ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. మోసం చేసిన వ్యక్తి ఖాతాను ఫ్రీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పొద్దని, ఆన్‌లైన్ లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు చెప్పొద్దని, ఆన్‌లైన్ మోసాలు జరిగితే 24 గంటల్లోపు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.